

పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు



కాళేశ్వరంలో రహదారిపై నిలిచిన వాహనాలు

# కాళేశ్వరం.. వెల్లువలా జనం

- సెలవు దినం కావడంతో పోటెత్తిన భక్తులు
- 15 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్
- నదీ స్నానం చేసిన గవర్నర్ జిష్ణుదేవ్ దంపతులు
- నేటితో ముగియనున్న పుష్కరాలు

### సరస్వతీ పుష్కరాలకు 11వ రోజు పెరిగిన రద్దీ



కాళేశ్వర ముక్తీశ్వర స్వామిని దర్శించుకోవడానికి వెళ్తున్న ఎమ్మెల్సీ వాణీదేవి



త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు

మహదేవపూర్ (కాళేశ్వరం)/కృష్ణకాలనీ, మే 25: కాళేశ్వరంలో సరస్వతీ నది పుష్కరాలకు జనం వెల్లువలా వస్తున్నది. 11వ రోజు ఆదివారం సెలవు దినం కావడంతో రద్దీ పెరిగింది. భక్తులు పోటెత్తడంతో సుమారు 15 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామయ్యింది. రాష్ట్రం నలుమూలల నుంచే కాక వివిధ రాష్ట్రాలకు చెందిన వారు లక్షలాదిగా తరలివచ్చి నదీ స్నానం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పిత్రు దేవతలకు పిండ ప్రదానం చేశారు. అనంతరం కాళేశ్వర ముక్తీశ్వర స్వామిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయంలో భక్తులు కిక్కిరిసిపోగా, స్వామివారి దర్శనానికి గంటల సమయం పట్టింది. పుష్కరాలకు ఒక్కరోజే సమయం ఉండగా, భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. భారీగా వచ్చిన వాహనాలతో పార్కింగ్ ప్రదేశాలు, ప్రధాన రహదారులన్నీ నిండిపోయాయి. సిరొంచ ప్రధాన రోడ్డుపై ఎదురెదురుగా వస్తున్న కార్లు ఢీకొనగా పలువురికి గాయాలయ్యాయి. వారిని ఆస్పత్రికి తరలించారు.

### నేడు కాళేశ్వరానికి ఎమ్మెల్సీ కవిత రాక..

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సోమవారం కాళేశ్వర క్షేత్రానికి రానున్నారు. పుష్కర ఘాట్‌లో నదీ స్నానం చేసి, కాళేశ్వర ముక్తీశ్వర స్వామిని దర్శించుకుంటారని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు లింగంపల్లి శ్రీనివాసరావు తెలిపారు.

### బస్సుల కోసం ఎదురుచూపులు

తిరుగు ప్రయాణంలో బస్సులు లేక భక్తులు ఇబ్బందులు పడ్డారు. రోడ్లపై గంటలు తరబడి ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. రద్దీకి అనుగుణంగా బస్సులు లేకపోవడంతో ప్రయాణికులు అవస్థలు పడ్డారు.

### భక్తిశ్రద్ధల మధ్య సరస్వతీ మాల హారతి

ఘాట్ వద్ద సరస్వతీ నవరత్న మాల హారతి కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధల మధ్య కాశీ పూజారులు సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి ఉత్సాహంగా వీక్షించారు.



ఆలయంలో స్వామివారికోసం క్యూలో నిల్చున్న భక్తులు

### ధరలు భగ్గుమంటున్నాయి

పుష్కరాల్లో ధరలు భగ్గుమంటున్నాయి. వాటర్ బాటిల్‌ను రూ.50కు విక్రయిస్తున్నారు. టీ, టిఫిన్‌కు కూడా డబుల్ రేట్ చెప్పుతున్నరు. రూ. 300 వచ్చే బ్యాగును రూ.1000కి అమ్ముతున్నారు. పిల్లలకు ఆట వస్తువులు ఏమీ కొనలేకపోతున్నం. అధిక ధరల దుకాణాల్లో అధికారులు తనిఖీలు నిర్వహించి కట్టడి చేయాలి.

*– చంద్రశేఖర్, బసంత్ నగర్, పెద్దపల్లి జిల్లా*



దైవ దర్శనానికి వస్తున్న మహారాష్ట్ర భక్తులు



కాళేశ్వర ముక్తీశ్వరుడికి హారతి ఇస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ దంపతులు



పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారికి నమస్కరిస్తున్న భక్తులు

### పుణ్యస్నానాలు ఆచరించిన గవర్నర్ దంపతులు

త్రివేణి సంగమంలో రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పుణ్యస్నానాలు ఆచరించారు. నదీమ తల్లికి పూజలు చేశారు. అనంతరం కాళేశ్వర ముక్తీశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు ఆయనకు అర్చకులు, అధికారులు మంగళ వాయిద్యాలతో పూర్ణకుంభ స్వాగతం పలికారు. అర్చకులు శాలువాతో సన్మానించి ఆశీర్వచనం చేశారు. తీర్థప్రసాదాలు, స్వామి చిత్రపటాన్ని అందజేశారు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.



బస్సుల కోసం ఎదురుచూస్తున్న ప్రజలు



పరీక్ష నిర్వహణ తీరును పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

# ప్రశాంతంగా యూపీఎస్సీ సివిల్స్ పరీక్ష

హనుమకొండ, మే 25 : హనుమకొండలో ఆదివారం నిర్వహించిన యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. మొత్తం పది పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా, ఉదయం 4,141 మంది అభ్యర్థులకు 2,435 మంది హాజరు కాగా 1,706 మంది, అలాగే మధ్యాహ్నం 2,422 మంది హాజరు కాగా 1,719 మంది గైర్హాజరయ్యారు. హనుమకొండ కలెక్టర్ పీ ప్రావీణ్య వడ్డేపల్లిలోని పింగిళి ప్రభుత్వ మహిళా కళాశాల, యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలల్లోని కేంద్రాలను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించడంతో పాటు, పరీక్ష నిర్వహణకు తీసుకున్న చర్యలపై ఆయా సెంటర్ల అధికారులను అడిగి తెలుసుకున్నారు.



చిన్నారులతో అక్షరాలు దిద్దిస్తున్న చైర్మన్ తిరుమల్‌రావు, ఫౌండర్ అనూప్

# స్కిల్ స్టార్క్ ఎర్లీ లెర్నింగ్ క్యాంపస్ ప్రారంభం

హసన్‌పర్తి, మే 25 : వరంగల్ నగరంలోనే అధునాతన హంగులతో స్కిల్ స్టార్క్ ఎర్లీ లెర్నింగ్ క్యాంపస్‌ను ఏర్పాటు చేసినట్లు ఎస్వీఎస్ విద్యాసంస్థల చైర్మన్ ఎర్రబెల్లి తిరుమల్‌రావు తెలిపారు. హనుమకొండలోని కిషన్‌పురలో ఈ క్యాంపస్‌ను వైస్ చైర్మన్ డాక్టర్ సువర్ణతో కలిసి ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ భానుప్రకాశ్, మాజీ ఎంపీ బోయినపెల్లి వినోద్‌కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎర్లీ లెర్నింగ్ క్యాంపస్‌ను ప్రారంభించడం అభినందనీయమని, హైదరాబాద్ తర్వాత వరంగల్ ఎడ్యుకేషన్ హబ్‌గా తయారవుతున్నదన్నారు. అనంతరం స్కిల్ స్టార్క్ విద్యాసంస్థల ఫౌండర్ ఎర్రబెల్లి అనూప్‌ను వారు అభినందించారు. ఈ సందర్భంగా చిన్నారులతో అక్షరాలు దిద్దించారు. కార్యక్రమంలో డాక్టర్ మాధవి, ప్రతీప్, హర్షిణి, మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు, వైద్యులు శివ సుబ్రహ్మణ్యం, రమేశ్, సుమిత్ర, శ్రావణ్‌కుమార్, రామారావు, కాజీపేట ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి, జనార్దన్, ప్రదీప్ రావు, కుడా మాజీ చైర్మన్ సుందర్‌రాజ్‌యాదవ్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



బస్వరాజుపల్లి కొనుగోలు కేంద్రంలో మొలకెత్తిన వడ్లు

# అధికారుల నిర్లక్ష్యం.. రైతుకు తీరని నష్టం

- తేమ వచ్చినా కొనుగోలు చేయని ధాన్యం
- సకాలంలో మిల్లులకు తరలించకపోవడంతో మళ్లీ తడిసిన వడ్లు
- బస్వరాజుపల్లిలో 50 ఎకరాల ధాన్యం నీటిపాలు
- కొనుగోలు కేంద్రాల్లోనే మొలకెత్తిన వడ్లు
- కన్నీరుమున్నీరవుతున్న అన్నదాతలు.. ఆదుకోవాలని వేడుకోలు

గణపురం, మే25 : ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యానికి మాయిశ్చర్ వచ్చినా అధికారుల నిర్లక్ష్యంతో కొనుగోలు చేయలేదు. ఆ తర్వాత అకాల వర్షం వచ్చి మండలంలోని బస్వరాజుపల్లిలో చేతికొచ్చిన పంట నీళ్ల పాలైంది. సుమారు 50 ఎకరాల ధాన్యం మొలకెత్తింది. ధాన్యాన్ని ఆరబెట్టి తీసుకొస్తే మాయిశ్చర్ వచ్చినా అధికారులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకుల అలసత్వంతో సకాలంలో గన్నీ బ్యాగులు అందించలేదు. దీంతో వర్షానికి పూర్తిగా తడిసి ముద్దయింది. మాయిశ్చర్ వచ్చి బస్తాలు నింపిన వడ్లను కూడా ట్రాన్స్‌పోర్టర్ నిర్లక్ష్యంతో సకాలంలో మిల్లులకు తరలించకపోవడంతో పూర్తిగా తడిసిపోయి మొలకెత్తాయి. అధికారుల నిర్లక్ష్యమే తమకు శాపంగా మారిందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సుమారు 50 ఎకరాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద ఆరబోశామని, మాయిశ్చర్ వచ్చినప్పుడు రాని అధికారులు ఇప్పుడు వచ్చి మాయిశ్చర్ లేదు, గన్నీ బ్యాగులు ఇవ్వొద్దని, కొనుగోలు చేయమని చెబుతున్నారని వారు వాపోయారు. ఇప్పటికే నిండా మునిగిన మమ్మల్ని ప్రభుత్వం ఆదుకోకపోతే ఆత్మహత్యలే శరణ్యమని, జిల్లా యంత్రాంగం స్పందించి మొలకెత్తిన ధాన్యాన్ని కొనుగోలు చేసి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

### వడ్లు తడిసి మొలకెత్తినయ్..



నాలుగు ఎకరాల్లో వరి పంట సాగు చేసిన. 20 రోజుల క్రితం కోత కోసి ధాన్యం ఆరబెట్టిన. సకాలంలో గన్ని బ్యాగులు ఇవ్వ లేదు. దీంతో ఇటీవల కురిసిన వర్షాలకు వడ్లు మొత్తం తడిసినయ్. మొలుకెత్తినా కూడా కేంద్రం నిర్వాహకులు, అధికారులు పట్టించుకోలేదు. ఇప్పుడు మాయిశ్చర్ లేదు కొనమంటున్నరు. తడిసిన వడ్లను కొనుగోలు చేసి ఆదుకోవాలి.

*– సైండ్ల తిరుపతి, రైతు, బస్వరాజుపల్లి*

### మా గోస పట్టించుకోండి



22 రోజుల క్రితం రెండెకరాల పొలం కోసి వడ్లు ఆరబెట్టి కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చిన. మాయిశ్చర్ వచ్చినా రేపు, మాపు అంటూ బార్‌దాన్ ఇవ్వ లేదు. తర్వాత వర్షం వచ్చి ధాన్యం తడిసింది. ఇప్పుడు మాయిశ్చర్ లేదని కొనుగోలు చేయడం లేదు. ఎమ్మెల్యే వచ్చి అధికారులను ధాన్యం తీసుకోమని చెప్పినా అధికారుల్లో చలనం లేదు. ఇప్పటికైనా మా గోస పట్టించుకోండి.

*– మారేపల్లి లక్ష్మి, రైతు, బస్వరాజుపల్లి*

# 1121 కామన్ రకం సీడ్ వడ్లను తీసుకోరట!

***అన్ని రకాలు కొంటామన్న ప్రభుత్వ హామీ బుట్టదాఖలు***

***వెంటనే కొనుగోలు చేయాలని మహిళా రైతు విజ్ఞప్తి***



స్టేషన్ ఘన్‌పూర్, మే 25 : 1121 కామన్ రకం సీడ్ వడ్లను ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తీసుకోవడం లేదు. అన్ని రకాల ధాన్యాన్ని కొంటామని చెప్పిన ప్రభుత్వ హామీ బుట్టదాఖలైందని మహిళా రైతు వాపోయింది. వివరాలిలా ఉన్నాయి.. మండలంలోని పాంనూర్ గ్రామానికి చెందిన బాషబోయిన అరుణకు భర్త లేకపోవడంతో తనకున్న ఎకరంన్నర పొలంతో పాటు రెండెకరాలు కౌలుకు తీసుకుని వ్యవసాయం చేసుకుంటూ ఇద్దరు పిల్లలను చదివించుకుంటున్నది. రెండెకరాల్లో 1121 కామన్ రకం సీడ్ వడ్లను పండించగా, సుమారు 50 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. నాలుగు రోజుల క్రితం పాంనూర్ గ్రామంలోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రానికి వడ్లు తీసుకొచ్చింది. సెంటర్ నిర్వాహకులు ఆ వడ్లను రైస్‌మిల్లర్ల వద్దకు తీసుకుపోగా వీటిని తీసుకుంటలేమని చెప్పి తిప్పి పంపించారు. కొనుగోలు కేంద్రంలో తీసుకోపోతే దళారులకు అమ్ముకోవాలా?, తెచ్చిన అప్పులు ఎలా తీర్చాలి?, నా పిల్లలను ఎలా చదివించు కోవాలని మహిళా రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నది. ప్రభుత్వం తన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఆమె కోరుతున్నది.

# బలగం అంజన్న కన్నుమూత

- కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ మృతి
- పలు సినిమాలు, నాటకాల్లో నటించిన బాబన్న
- వరంగల్, రాయపర్తిలో అలుముకున్న విషాదం
- హీరో ప్రియదర్శి, డైరెక్టర్ వేణుతో పాటు పలువురు ప్రముఖుల సంతాపం

రాయపర్తి/గిర్మాజీపేట, మే 25 : కనుమరుగవుతున్న తెలుగు ప్రజల గ్రామీణ ప్రాంత బంధాలు, బంధుత్వాలు కళ్లకు కట్టేలా నిర్మితమైన బలగం సినిమా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ప్రత్యేక గుర్తింపును తెచ్చుకున్నది. ఇందులో ప్రధాన భూమిక పోషించిన నటుడు జీవీ బాబు అలియాస్ బలగం బాబన్న (అంజన్న పాత్రధారి) కొద్ది రోజులుగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. వరంగల్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతూ శనివారం రాత్రి కన్నుమూశారు. వరంగల్ జిల్లా రాయపర్తి మండల కేంద్రంలోని గంగపుత్ర కాలనీకి చెందిన గుడిబోయిన వీరలక్ష్మి-వెంకటయ్య దంపతులకు కుమార్తె, కొడుకు ఉన్నారు. ఒక్కగానొక్క కొడుకును నిరుపేదలైన తల్లిదండ్రులు కష్టపడి చదివించారు. బాబుకు చిన్నతనం నుంచే నాటకాలు, నాటికలు అంటే మక్కువ ఎక్కువని అతడి సహచరులు తెలిపారు. 10వ తరగతి వరకు చదివిన తర్వాత కొంతకాలం పాటు స్థానిక మత్స్యపారిశ్రామిక సంఘంలో సభ్యత్వం తీసుకున్న బాబు కులస్తులందరితో కలిసి చేపల వేటకు వెళ్లేవాడు. ఈ క్రమంలో బాబుకు వివాహం అయిన తర్వాత వరంగల్‌లోని కాకతీయ కళాశాలలో ఐటీఐ పూర్తి చేశాడు. అనంతరం టెలివిజన్ (టీవీ) మెకానిక్‌గా వర్క్‌షాప్ పెట్టుకొని వరంగల్‌లోని పాపయ్యపేట్ చమన్‌కు మకాం మార్చాడు. గుడిబోయిన బాబు పాపయ్యపేట చమన్‌లో ఉన్నా, అతడి తల్లిదండ్రులు గుడిబోయిన వీరలక్ష్మి-వెంకటయ్య రాయపర్తిలోనే తుదిశ్వాస విడిచినట్లు చెప్పారు. తన స్వగ్రామమైన రాయపర్తిలోని బంధువులు, కులస్తుల ఇండ్లలో జరిగే శుభ, అశుభ కార్యక్రమాలకు బాబు తరచూ హాజరయ్యేవాడు. బలగం సినిమాతో గొప్ప గుర్తింపును తెచ్చుకున్న బాబు రాయపర్తి వస్తే మాత్రం తమతో చిన్న పిల్లవాడివలె కలిసిపోయేవాడని అతడి స్నేహితులు, సన్నిహితులు తెలిపారు. కమెడియన్ వేణు యెల్దండి దర్శకత్వం, దిల్‌రాజు ప్రొడక్షన్‌లో వచ్చిన బలగం సినిమాలో హీరో ప్రియదర్శి చిన్నతాతగా జీవీ బాబు నటించి ఆకట్టుకున్నారు. ఈ మధ్యే బలగం సినిమా డైరెక్టర్ వేణు, హీరో ప్రియదర్శి జీవీ బాబు వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం అందజేశారు. ఇంతలోనే ఆయన మృతి చెందడం బాధాకరమని వేణు, ప్రియదర్శి సంతాపం తెలిపారు. ఆయన కుటుంబసభ్యులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. జీవీ బాబు రంగస్థల నటుడు. బలగం సినిమా తర్వాత రజాకార్ సినిమాలో నటించారు. ఆయన ఇప్పటివరకు 20 సినిమాల్లో నటించినా, బలగం సినిమాతో గుర్తింపు వచ్చింది. బాబు మృతితో వరంగల్ నగరంలోని పాపయ్యపేట చమన్, రామన్నపేట ప్రాంతంతో పాటు రాయపర్తిలో విషాదం అలుముకుంది. బాబు మృతిపై జబర్దస్త్ ఫేం, సినీ ఆర్టిస్ట్ రచ్చ రవి, రాష్ట్ర నాటక సమాజాల సమాఖ్య అధ్యక్షుడు ఆకుల సదానందం, వరంగల్ రంగస్థలం కళాకారుల ఐక్య వేదిక బాధ్యుడు కాజీపేట తిరుమలయ్య, ఎస్ఎస్ఆర్ మూర్తి, ప్రభాకర్, జేఎన్ శర్మ, సాధుల సురేశ్, ఆకుతోట లక్ష్మణ్, కుడికాల జనార్దన్, మాలి విజయ్, షఫీ, జూలూరు నాగరాజు, మయూరి ఆర్ట్స్ క్రియేషన్స్ నుంచి శతపతి శ్యామల, వరంగల్ నాటక సమాజాల సమాఖ్య అధ్యక్షుడు మాడిశెట్టి రమేశ్, ఒడపల్లి చక్రపాణి, దేవరాజు, రవీందర్‌రావు, సదానందాచారి, వనపర్తి రాజేంద్రప్రసాద్, సహృదయ సంస్థ అధ్యక్షుడు గిరిజామనోహర్‌బాబు, కార్యదర్శి వనం లక్ష్మీకాంతరావు, ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎన్‌వీఎన్ చారి సంతాపం ప్రకటించారు.



జీవీ బాబు (ఫైల్)